# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 11-12-2024** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **స్మార్ట్ ఇండియా హ్యాకథాన్ 2024లో భాగంగా ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఈ రోజు దృశ్య మాధ్యమం ద్వారా యువ ఆవిష్కర్తలతో సంభాషిస్తారు.**

2. **ఆంధ్రప్రదేశ్‌లో జనన, మరణ ధృవపత్రాల కోసం నూతన వెబ్ పోర్టల్‌ను ప్రారంభిస్తున్నట్లు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రకటించారు.**

3. **తెలంగాణలో వ్యవసాయ యాంత్రీకరణ అమలును వేగవంతం చేయాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు.**

4. **ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన ఈరోజు, రేపు కలెక్టర్ల సమావేశం జరుగుతుంది.**

5. **ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిలో 8 వేల 821.14 కోట్ల రూపాయల నిర్మాణ పనులకు రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది.**

==========================

స్మార్ట్ ఇండియా హ్యాకథాన్ 2024లో భాగంగా ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఈ రోజు దృశ్య మాధ్యమం ద్వారా యువ ఆవిష్కర్తలతో సంభాషిస్తారు. ఈ కార్యక్రమంలో 13 వందలకు పైగా విద్యార్థి బృందాలు పాల్గొంటాయి. స్మార్ట్ ఇండియా హ్యాకథాన్ 7వ ఎడిషన్ దేశవ్యాప్తంగా 51 నోడల్ కేంద్రాలలో ఈరోజు నుంచి ప్రారంభమవుతుంది. సాఫ్ట్‌వేర్ విభాగ కార్యక్రమం 36 గంటల పాటు, హార్డ్‌వేర్ ఎడిషన్ ఈ నెల 15 వరకు జరగనుంది. విద్య, నైపుణ్యాభివృద్ధి, ఆరోగ్య భద్రత, లాజిస్టిక్స్, స్మార్ట్ టెక్నాలజీస్ వంటి జాతీయ ప్రాముఖ్యత కలిగిన రంగాలకు సంబంధించిన ఇతివృత్తాలపై విద్యార్థులు తమ ఆలోచనలు, ఆవిష్కరణలను ప్రదర్శించనున్నారు.

--------------------------

ఆంధ్రప్రదేశ్‌లో జనన, మరణ ధ్రువపత్రాలను సులభంగా పొందేందుకు నూతన వెబ్ పోర్టల్‌ను వచ్చే ఏడాది జనవరి 1న ప్రారంభిస్తున్నట్లు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రకటించారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయం రియల్ టైం గవర్నెన్స్ –ఆర్టీజీఎస్‌పై ముఖ్యమంత్రి నిన్న వివిధ ప్రభుత్వ శాఖల అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ, ప్రభుత్వ సేవలు వేగంగా అందించేలా అన్ని ప్రభుత్వ శాఖలు సాంకేతికతను విస్తృతంగా వినియోగించుకోవాలని సూచించారు. అన్ని శాఖల సమాచారంతో ఆర్టీజీఎస్ వ్యవస్థతో వాట్సప్ గవర్నెన్స్ ద్వారా ప్రజలకు సేవలు అందించాలని చెప్పారు. వాట్సప్ ద్వారా కుల, ఆదాయ ధ్రువీకరణ వంటి పత్రాలు పొందేలా వ్యవస్థను రూపొందించాలని అధికారులను ఆదేశించారు.

-------------------------

'ప్రజావాణి' కార్యక్రమం ద్వారా ప్రజల సమస్యలను పరిష్కరిస్తున్నామని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో నిన్న ప్రజల నుంచి ఆయన అర్జీలను స్వీకరించారు. అనంతరం ఉపముఖ్యమంత్రి పాత్రికేయులతో మాట్లాడుతూ,

వాయిస్... 33 సెకన్లు

-------------------------

తెలంగాణలో వ్యవసాయ యాంత్రీకరణ, బిందు సేద్యం వంటి పథకాల అమలును వేగవంతం చేయాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. హైదరాబాద్‌లోని రాష్ట్ర సచివాలయంలో వ్యవసాయ, ఉద్యాన, మార్కెటింగ్ శాఖల అధికారులతో మంత్రి నిన్న సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చిన నిధులను పూర్తి స్థాయిలో వినియోగించే విధంగా ప్రణాళిక సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. వచ్చే ఏడాది మార్చి నాటికి లక్ష ఎకరాల్లో పామాయిల్ సాగు లక్ష్యాన్ని పూర్తి చేయాలని.. ఇందుకోసం అన్ని చర్యలు తీసుకోవాలని అధికారులను మంత్రి ఆదేశించారు.

-------------------------

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన ఈరోజు, రేపు కలెక్టర్ల సమావేశం జరుగుతుంది. అమరావతి సచివాలయంలో జరిగే ఈ సమావేశంలో ఎన్డీయే కూటమి ప్రభుత్వం ఆరు నెలల పాలనలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు, "స్వర్ణాంధ్రవిజన్ 2047" డాక్యుమెంట్, నూతనంగా తీసుకొచ్చిన పాలసీలు, వంటి అంశాలపై ముఖ్యమంత్రి కలెక్టర్లకు దిశానిర్దేశం చేస్తారు. రానున్న నాలుగున్నరేళ్లు ఏ విధమైన లక్ష్యాలతో ముందుకెళ్లాలన్న అంశంపై ఈ సమావేశంలో చర్చించనున్నారు.

-------------------------

ఆంధ్రప్రదేశ్‌లో ఖాళీ అయిన మూడు రాజ్యసభ స్థానాలకు ఎన్డీఏ కూటమి తరపున తెలుగుదేశం నుండి బీదా మస్తాన్ రావు, సానా సతీశ్, భారతీయ జనతా పార్టీ తరపున ఆర్.కృష్ణయ్య నిన్న నామినేషన్లను దాఖలు చేశారు. సచివాలయంలో నామినేషన్ వేసిన అనంతరం ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుతో మర్యాదపూర్వకంగా వారు సమావేశం అయ్యారు.

-------------------------

ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిలో 8 వేల 821.14 కోట్ల రూపాయల నిర్మాణ పనులకు రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం తెలిపిందని పురపాలక శాఖ మంత్రి పి. నారాయణ వెల్లడించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన సచివాలయంలో నిన్న రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ – సీఆర్డీఏ సమావేశం జరిగింది. సమావేశం అనంతరం మంత్రి పాత్రికేయులతో మాట్లాడుతూ,

వాయిస్ .. 33 సెకన్లు

-------------------------

ఆంధ్రప్రదేశ్‌లోని నంద్యాల జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేలా చర్యలు తీసుకుంటున్నామని జిల్లా

ఇంచార్జ్ మంత్రి పయ్యావుల కేశవ్ తెలిపారు. నంద్యాల జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన జిల్లా అభివృద్ధి సమీక్ష సమావేశంలో మంత్రి నిన్న పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,

వాయిస్... 26 సెకన్లు

---------------------------

పవిత్ర గ్రంథాలలో ఒకటైన భగవద్గీతా జయంతిని ఈ రోజు ప్రజలు భక్తి శ్రద్ధలతో జరుపుకుంటున్నారు. మార్గశిర మాసం శుద్ధ ఏకాదశి రోజున ఈ కార్యక్రమం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. భగవద్గీతను “గీత” అని సంక్షిప్తంగా పిలుస్తారు. దీనిని “ గీతోపనిషత్తు” అని కూడా అంటారు. ద్వాపరయుగంలో కురుక్షేత్ర సంగ్రామం సందర్భంగా అర్జునుని ద్వారా శ్రీ కృష్ణుడు సమస్త లోకానికి అందించిన బ్రహ్మోపదేశమే భగవద్గీత అని పురాణాలు పేర్కొంటున్నాయి. భగవద్గీత జయంతిని “మోక్షద ఏకాదశి” అని కూడా పిలుస్తారు.

---------------------------

ఆగ్నేయ బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో రానున్న రెండు రోజుల్లో ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా భారీవర్షాలు కురుస్తాయని అమరావతిలోని వాతావరణ కేంద్రం తెలిపింది. ప్రస్తుతం ఈ అల్పపీడనం స్థిరంగా కొనసాగుతోందని పేర్కొంది. అల్పపీడనం పశ్చిమ వాయువ్య దిశగా కదులుతూ.. నైరుతి బంగాళాఖాతంలో ప్రవేశించే అవకాశం ఉందని వెల్లడించింది. దీని ప్రభావంతో ఆంధ్రప్రదేశ్ లో 2 రోజుల పాటు కోస్తా, రాయలసీమలో జిల్లాల్లో అక్కడక్కడా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. మరోవైపు తెలంగాణలో చలి తీవ్రత కొనసాగుతోంది. రాష్ట్రంలోని పలు జిల్లాల్లో కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది.

---------------------------

శబరిమలకు వెళ్ళే అయ్యప్ప భక్తుల కోసం ఇప్పటికే ప్రత్యేక రైళ్లను నడుపుతున్న దక్షిణ మధ్య రైల్వే అదనంగా మరికొన్ని రైళ్లను నడపనున్నట్లు ప్రకటించింది. ఇందులో భాగంగా కాకినాడ పోర్టు–కొల్లం ఈనెల 18, 25 తేదీల్లో బుధవారం రాత్రి కాకినాడ పోర్టులో బయలుదేరుతుందని, తిరుగు ప్రయాణంలో ఈ రైలు ఈనెల 13, 20, 27 తేదీల్లో శుక్రవారం ఉదయం కొల్లంలో బయలుదేరుతుందని తెలిపింది.

======================